సాక్షి
ఒడిశా



శనివారం । 8 । మార్చి । 2025

న్యూస్‌రీల్

బైక్‌లను తగలబెట్టిన దుండగులు


కాలిపోయిన ద్విచక్ర వాహనాలు

రాయగడ: జిల్లాలో టికిరి రైల్వేస్టేషన్ సమీపంలోని ఒక అతిథి గృహం వద్ద పార్కింగ్‌లో ఉన్న మూడు ద్విచక్ర వాహనాలను గుర్తు తెలియని దుండగులు తగలబెట్టారు. దీంతో వాహనాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. సమాచారం తెలుసుకున్న అతిథి గృహం యజమాని కె.పవన్ కుమార్ టికిరి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా దుండగులను గుర్తిస్తున్నట్లు తెలుస్తోంది.

అదుపు తప్పి లారీ బోల్తా


బోల్తాపడిపోయిన లారీ

రాయగడ: కొరాపుట్ నుంచి రాయగడ మీదుగా కర్రల లోడ్‌తో జేకేపూర్ వెళ్తున్న లారీ అదుపుతప్పి స్థానిక కొరాపుట్ కూడలి వద్ద శుక్రవారం బోల్తా పడింది. దీంతో వెదురు కర్రలు ఒక వైపుగా ఒరిగిపోయాయి. డ్రైవరు సురక్షితంగా బయటపడ్డాడు. సమాచారం తెలుసుకున్న సదరు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని లారీని జేసీబీ సాయంతో పక్కకు తీసుకొచ్చి ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకున్నారు.

బీఎస్‌ఎఫ్ జవాన్‌కు గాయాలు


గాయాలతో చికిత్స పొందుతున్న జవాన్ అశోక్ కుమార్

రాయగడ: జిల్లాలోని మునిగుడ రైల్వేస్టేషన్ వద్ద గురువారం రాత్రి రన్నింగ్‌లో ఉన్న ట్రైన్ నుంచి ప్రమాదవశాత్తు జారిపడిన బీఎస్‌ఎఫ్ జవాన్ తీవ్రగాయాలకు గురయ్యాడు. వెంటనే బీఎస్‌ఎఫ్ సిబ్బందితో పాటు ఆర్పీఎఫ్ పోలీసులు అతడిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం జవాన్‌ను ప్రత్యేక హెలీకాప్టర్‌లో మెరుగైన చికిత్స కోసం భువనేశ్వర్‌కు తరలించారు. ఈ ప్రమాదంలో గాయాలుపాలైన జవాన్ అశోక్ కుమార్ మీనాగా గుర్తించారు. కొంధమాల్ జిల్లా బలిగుడలోని 136వ బెటాలియన్ బీఎస్‌ఎఫ్ జవానుగా గుర్తించారు. గురువారం అశోక్ జగదల్‌పూర్–హవడా సమలేశ్వరి ఎక్స్‌ప్రెస్‌లో మరో ఆరుగురు జవాన్లతో కలిసి కొరాపుట్ నుంచి మునిగుడ వరకు ప్రయాణిస్తున్నాడు. ఈ క్రమంలో మునిగుడ రైల్వేస్టేషన్ సమీపిస్తున్న సమయంలో గేటు వద్ద అదుపు తప్పి పడిపోయాడు. దీంతో అతని ఎడమ చేయి పూర్తిగా తెగిపోయింది.



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు

నగదు:	రూ. 5,36,300
బంగారం:	550 మిల్లీ గ్రాములు
వెండి:	33 గ్రాముల 100 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరీ

విపక్షాల దాడి..
దద్దరిల్లిన సభ

- అంచెలంచెలుగా సభ వాయిదా
- ప్రభుత్వ నిర్లక్ష్యం తగదని ప్రతిపక్షాల ఆందోళన


స్పీకరు పోడియం చుట్టుముట్టిన కాంగ్రెసు సభ్యులు

భువనేశ్వర్: రాష్ట్ర శాసన సభలో రెండో దశ బడ్జెట్ సమావేశాలు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. సభా కార్యక్రమాలు ఆరంభం నుంచి సభలో యుద్ధ వాతావరణం నెలకొంది. ప్రధాన విపక్షం బిజూ జనతా దళ్, కాంగ్రెసు సభ్యులు స్పీకర్‌ను చుట్టుముట్టారు. సభా కార్యకలాపాల నిర్వహణకు ఏమాత్రం అవకాశం లేని పరిస్థితులతో ప్రశ్నోత్తరాలకు గండి పడింది. అది మొదలుకొని సభా కార్యకలాపాల్ని స్పీకరు అంచెలంచెలుగా వాయిదా వేయాల్సి వచ్చింది. ఈ నెల 5న పంచాయతీ రాజ్ దివస్‌గా నిర్వహించాల్సిన మాజీ ముఖ్యమంత్రి బిజూ పట్నాయక్ జయంతి కార్యక్రమం రద్దు చేయడంతో పాటు ప్రభుత్వ సెలవు తొలగించిన విషయం తెలిసిందే. ఈ పరిస్థితిని ప్రతిపక్ష బిజూ జనతా దళ్ సభ్యులు తీవ్రంగా నిరసిస్తూ ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో స్పీకరు పోడియం చుట్టుముట్టారు. విపక్ష నేత నవీన్ పట్నాయక్ మౌనం వహించి దళం సభ్యుల వ్యతిరేకతని ప్రోత్సహించారు. దివంగత బిజూ పట్నాయక్ జాతీయ స్థాయి చరిత్రకారునిగా తనకంటూ ప్రత్యేక ఉనికిని ఆవిష్కరించిన నేత. ఆయనకు బిజూ జనతా దళ్‌కు పరిమితం చేసి అగౌరవపరచడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి ప్రతీక అని బీజేడీ విరుచుకు పడింది. బిజూ పట్నాయక్‌ను అగౌరవపరచడం ఆమోదయోగ్యం కాదని, వారు చేసిన నినాదాలతో శాసన సభ మారు మోగింది.

రాష్ట్రంలో మహిళలపై హింసాత్మక సంఘటనలు పెచ్చుమీరాయని, బాలికలకు కనీసం విద్యా సంస్థల్లో రక్షణ లేకుండా పోయిన దయనీయ పరిస్థితులు తాండవిస్తున్నాయని దుమ్మెత్తిపోశారు. మహిళలకు భద్రత, రక్షణ కల్పించడంపట్ల రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తుందని కాంగ్రెసు సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ చర్యపై నిరసనగా వీరంతా స్పీకరు పోడియం చుట్టుముట్టారు. తారా ప్రసాద్ బాహిణీపతి ఆధ్వర్యంలో కాంగ్రెసు సభ్యులు స్పీకర్ పోడియం ఎక్కడానికి విఫల యత్నం చేశారు.

నిరసనలు, నినాదాల మధ్య అమూల్యమైన ప్రశ్నోత్తరాల సమయం నిర్వహణ అసాధ్యమైంది. ఈ కార్యక్రమం ప్రారంభమైన స్వల్ప వ్యవధిలో విపక్షాల దాడి తార స్థాయికి చేరడంతో సభా కార్యకలాపాల్ని తొలుత మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా వేసినట్లు స్పీకర్ సురమా పాఢి సభను వాయిదా వేశారు. ఆ తర్వాత కూడ పరిస్థితి ఏమాత్రం కుదుట పడలేదు. దాదాపు పావు గంట సేపు విపక్షాల దాడి నియంత్రించేందుకు స్పీకరు చేసిన ప్రయత్నాలు బెడిసి కొట్టాయి. బిజూ పట్నాయక్‌కు అగౌరవం నినాదంతో బీజేడీ, మహిళలకు భద్రత లేదనే ఆరోపణతో కాంగ్రెసు సభ్యుల వ్యతిరేకతని అడ్డుకునే పరిస్థితి లేక తిరిగి సాయంత్రం 4 గంటల వరకు మరోసారి సభని వాయిదా వేశారు.

అభివృద్ధికి ఆమడ దూరం


మండియాడొంగొ గ్రామం

- మండియాడొంగొలో మౌలిక సదుపాయాలు కరువు


మూతపడిన పాఠశాల


రాహదారిపై నడిచి వెళ్తున్న గ్రామస్తులు

రాయగడ: జిల్లాలోని కొలన సమితి పరిధిలో ఉన్న మండియాడొంగొ గ్రామం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. సుమారు 60 కుటుంబాలకు చెందిన 150 మందికి పైగా జనాభా ఇక్కడ నివసిస్తున్నారు. ఎత్తయిన కొండపై ఉండే ఈ గ్రామానికి వెళ్లేందుకు రాళ్లతేరిన రహదారే దిక్కు. గ్రామానికి రహదారి నిర్మాణం చేపట్టేందుకు మనోరేగ పథకంలో ప్రతిఏటా నిధులు మంజూరవుతున్నాయి. అయితే ఆ నిధులతో మట్టిని పోసి చేతులు దులుపుకుంటున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామం నుంచి సుమారు మూడు కిలోమీటర్ల దూరంలో పంచాయతీ కార్యాలయం, 28 కిలోమీటర్ల దూరంలో సమితి కార్యాలయం ఉంది. గ్రామంలో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండడంతో పాఠశాలను మూసివేశారు. దీంతో దాదాపు పది మంది విద్యార్థులు చదువుకునేందుకు మూడు కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి వస్తోంది. ఇకపోతే గ్రామంలో తాగునీటి సమస్య వెంటాడుతోంది. 150 మందికి కేవలం ఒకే గొట్టపుబావి ఉండడంతో తాగునీటికి అవస్థలు తప్పడం లేదని వాపోతున్నారు. సమస్యను సంబంధిత శాఖ అధికారులకు తెలియజేసినప్పటికీ ఫలితం ఉండడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సరైన రహదారి సౌకర్యం లేకపోవడంతో అత్యవసర పరిస్థితుల్లో గ్రామానికి అంబులెన్స్‌లు చేరుకోవడం లేదని, దీంతో రోగులను మోసుకుంటూ తీసుకెళ్లాల్సిన పరిస్థితులు ఉన్నాయని తెలుపుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టాలని కోరుతున్నారు.

వయో వృద్ధుల తీర్థయాత్ర ప్రారంభం


తీర్థయాత్ర బస్సులను ప్రారంభిస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: గజపతి జిల్లా పర్లాకిమిడి నుంచి 72 మంది వృద్ధులు తీర్థయాత్రల పథకం కింద అయోధ్య, కాశీ యాత్రలకు రెండు బస్సుల్లో శుక్రవారం బయల్దేరారు. వీరంతా 6 రోజులు తీర్థయాత్రలు చేసి అనంతరం ఈనెల 13వ తేదీన మరలా స్వగ్రామాలకు చేరుకుంటారు. ఈ బస్సులను జిల్లా కలెక్టర్ బిజయకుమార్ దాస్, పర్లాకిమిడి పురపాలక సంఘ అధ్యక్షురాలు నిర్మలా శెఠి పచ్చజెండా ఊపి ప్రారంభించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన ఈ వయోవృద్ధుల తీర్థయాత్ర పథకం ద్వారా ఇప్పటికే గజపతి జిల్లా నుండి బ్యాచ్‌లు వెళ్లాయని కలెక్టర్ బిజయ కుమార్ దాస్ తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ అధ్యక్షుడు గవర తిరుపతిరావు, జిల్లా శిశు సంరక్షణ అధికారి అరుణ్ కుమార్ త్రిపాఠి, జిల్లా సాంస్కృతిక శాఖ అధికారి అర్చనా మంగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర హైకోర్టు కొత్త ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ హరీష్ టండన్


జస్టిస్ హరీష్ టండన్

భువనేశ్వర్: జస్టిస్ హరీష్ టండన్ రాష్ట్ర హైకోర్టు కొత్త ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టనున్నారు. సుప్రీం కోర్టు కొలీజియం సిఫార్సు మేరకు ఈ నియామకం జరిగింది. ఆయన ప్రస్తుతం కోల్‌కతా హై కోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. 2010 సంవత్సరం ఏప్రిల్ నెల 13 నుంచి కోల్‌కతా హైకోర్టులో న్యాయమూర్తిగా పని చేస్తున్నారు. 2025 సంవత్సరం జనవరి 19న రాష్ట్ర హై కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చక్రధారి శరణ్ సింగ్ పదవీ విరమణ చేశారు. అప్పటి నుంచి ఈ శాశ్వత పదవి ఖాళీ అయింది. సుప్రీం కోర్టు కొలీజియం ఒడిశా హై కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ హరీష్ టండన్‌ను సిఫార్సు చేయడంతో ఈ ఖాళీ భర్తీ కానుంది.

అడవిలో యువకుడి మృతదేహం

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా ఛలాన్‌గూఢ పంచాయతీ పరిధిలోని సమీప అడవిలో శుక్రవారం ఉదయం ఓ యువకుడి మృతదేహం కనిపించిందని మల్కన్‌గిరి పోలీసులకు స్థానికులు సమాచారం ఇచ్చారు. మల్కన్‌గిరి జిల్లా కేంద్రంలో నివాసం ఉంటున్న జీతు అనే యువకుడు డొంబురు,జానీ,రాహుల్ కచిమ్ అనే ముగ్గురు యువకులతో రిక్లమేషన్‌కాలనీకి చెందిన ఆశిష్ హల్దార్ అనే కాంట్రాక్టర్‌తో సుకుమ ప్రాంతంలో కొత్త ఇళ్లకు సున్నం వేయడానికి మూడు రోజుల కిందట వెళ్లాడు. మిగతా వారు పని పూర్తి చేసుకుని వచ్చేశారు. జీతు మాత్రం ఇంటికి రాలేదు. దీంతో జీతు తమ్ముడు మల్కన్‌గిరి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా దర్యాప్తు ప్రారంభించారు. శుక్రవారం ఉదయం మృతదేహం కనిపించడంతో మల్కన్‌గిరి పోలీసు ఐఐసి రీగాన్ కీండో సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని మల్కన్‌గిరి ప్రభుత్వాస్పత్రికి పంపించారు.

కొండల్లో కార్చిచ్చు


జిమిడిపేట వద్ద అడవుల్లో మంటలు

రాయగడ: రాయగడ నుంచి కెరడ, జిమిడిపేట, బడహంస, పితామహల్, టింటాలిగుడ, చింతలిగుడ, తడమ, నతమ, మల్లిపొడ, పెరిగాంకు వెళ్లే ప్రాంతాల్లో గల కొండల్లో కార్చిచ్చు రగులుతోంది. పోడు వ్యవసాయం పేరిట ఆదివాసీలు అడవుల్లో మంటలు పెడుతున్నారు. కొండలను తగుల బెట్టవద్దని అటవీ శాఖ ఎన్నో అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నా వాటిని పెడ చెవిన పెడుతున్న ఆదివాసీలు కొండలను తగులబెడుతున్నారు.

ఇళ్ల పట్టాలు ఇవ్వాలని విజ్ఞప్తి


సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న మహిళలు

జయపురం: ఇళ్ల పట్టాలు అందజేసి న్యాయం చేయాలని స్థానిక క్రిస్టియన్‌పేట మహిళలు కోరారు. ఈ మేరకు జయపురం సబ్‌కలెక్టర్ కుమారి అక్కవరం శొశ్యా రెడ్డిని శుక్రవారం కలిసి విజ్ఞప్తి చేసి వినతిపత్రం సమర్పించారు. మున్సిపాలిటీ ఐదో వార్డు కౌన్సిలర్ ప్రణభ కిశోర్ నాయిక్ నేతృత్వంలో మహిళలు సబ్‌కలెక్టర్‌ను కలిశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ కిశోర్ నాయిక్ మాట్లాడుతూ.. పట్టాలు లేకపోవడంతో లబ్ధిదారులైన మహిళలు సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. మున్సిపల్ అధికారులు ఇచ్చిన ప్రమాణ పత్రాలను సబ్‌కలెక్టర్‌కు చూపించారు. అయితే నేటి వరకు పట్టాలు సమకూర్చలేదని ఆరోపించారు. ఎంతో కాలంగా ఉన్న ఈ సమస్యను పరిష్కరించకపోవడంతో వందమంది లబ్ధిదారులు అన్యాయానికి గురవుతున్నారన్నారు. అయితే మంజూరు చేసిన ఇళ్ల స్థలాల్లో జలాశయం ఉండటం వలన వారికి ఎల్.ఆర్.సి ఇవ్వడం లేకపోతున్నామని తహసీల్దార్ చెబుతున్నారని సబ్‌కలెక్టర్‌కు కౌన్సిలర్ వివరించారు. సమస్యను తెలుసుకొని చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని సబ్‌కలెక్టర్ హామీ ఇచ్చారు.సబ్‌కలెక్టర్‌ను కలిసిన వారిలో రింకి నాయిక్, జానకీ నంద, సుభాషిణీ బాగ్, మోహినీ బాగ్, కుమారి హియాల్, యరియ హియాల్‌లతో పాటు బిజురాజానగర్, కింద వీధి, కోర్టు కాలనీకి చెందిన మహిళలు ఉన్నారు.

కొరాపుట్ జిల్లాలకు మణిహారం భారత మాల నిర్మాణం


సర్వీసు రోడ్ల నిర్మాణం


విశాఖ పట్నం వైపు మార్గం


నబరంగ్‌పూర్ జిల్లా ప్రాంతంలో పూర్తయిన భారత మాల రోడ్డు

కొరాపుట్: కొరాపుట్, నబరంగ్‌పూర్ జిల్లాలకు మణిహారంగా భారత మాల రోడ్డు నిలవనుంది. దీని నిర్మాణం దాదాపు 90 శాతం పూర్తి కావచ్చింది. కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ రోడ్డు నిర్మిస్తోంది. విశాఖ పట్నం నుంచి రాయపూర్ వరకు 6 అంచెల ఎకనామిక్ కారిడార్‌గా రూపు దిద్దుకుంటోంది. దీని నిర్మాణం కోసం సుమారు రు.20 వేల కోట్లు వెచ్చిస్తున్నారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల మీదుగా ఈ నిర్మాణం కొనసాగింది. కొరాపుట్ జిల్లాలకు రావాలంటే ఘాట్ రోడ్లు ఉంటాయనే ప్రచారం ఉంది. కానీ ఈ రోడ్డులో ఎక్కడా ఘాట్ రోడ్డు లేకుండా కొండల కింద నుంచి సొరంగాలు నిర్మించారు. ఈ రోడ్డు ఒడిశాలో కేవలం కొరాపుట్,నబరంగ్‌పూర్ జిల్లాల నుంచి మాత్రమే వెళ్లనుంది. 464 కిలోమీటర్ల దూరం ఉండే ఈ రోడ్డు నిర్మాణంతో ఈ ప్రాంతం అభివృద్ధిలోకి వస్తుందని కేంద్రం భావిస్తోంది.

కాంగ్రెస్ వాకౌట్


సభ నుంచి వాకౌట్ చేసిన కాంగ్రెసు సభ్యులు


గాంధీ బొమ్మ దగ్గర నిరసన ప్రదర్శనలో కాంగ్రెసు ఎమ్మెల్యేలు

భువనేశ్వర్: శాసన సభలో మలి విడత బడ్జెటు సమావేశాలు పురస్కరించుకుని సభలో తలెత్తిన పరిస్థితులకు నిరసనగా కాంగ్రెసు సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. అనంతరం సభ ఆవరణలో ఉన్న జాతిపిత మహాత్మ గాంధీ విగ్రహం దగ్గర బైఠాయించి నిరసన ప్రదర్శించారు. రాష్ట్రంలో సగటు మహిళకు భద్రత కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. అత్యాచారాలు నిత్య కృత్యాలుగా పరిణమిస్తున్నాయని, పాఠశాలల్లో మైనరు బాలికలు విద్యాబుద్ధులు సాధించడం బదులుగా గర్భం దాల్చడం వంటి సిగ్గు చేటు సంఘటనలు తరచూ చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. ఈ చర్యల పట్ల ప్రభుత్వ స్పందన శూన్యంగా పరిణమించిందని కాంగ్రెసు సభ్యులు ఆరోపించారు. హోం శాఖ బాధ్యతలు నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి తక్షణమే మౌనం వీడి సభలో వివరణ ప్రవేశ పెట్టాలని సభ్యులు పట్టుబట్టారు. వీరి వాదనను స్పీకరు పట్టించుకోకపోవడంతో నిరసనగా సభ నుంచి బయటకు వచ్చారు. రాష్ట్రంలో మహిళల పట్ల జరుగుతున్న అత్యాచారాల వ్యతిరేకంగా ప్లకార్డులతో నిరసన ప్రదర్శించారు.

మిలెట్ శక్తి కేఫ్ ప్రారంభం


మిల్లెట్ శక్తి కేఫ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి


కేఫ్‌లో కొనుగోలు చేస్తున్న మహిళ

జయపురం: స్థానిక మున్సిపాలిటీ కార్యాలయం ఎదురుగా మిలెట్ శక్తి కేఫ్‌ను జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి శుక్రవారం ప్రారంభించారు. రూ. 12 లక్షల 50 వేల వ్యయంతో దీన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కేఫ్‌లో పుష్టికర, ఆరోగ్య కరమైన ఆహార పదార్థాలను అందుబాటులో ఉంచుతున్నట్టు పేర్కొన్నారు. మండియ ఆహార పదార్థాలను ప్రజలకు పరిచయం చేయటమే కేఫ్ ప్రధాన లక్ష్యం అన్నారు. కేఫ్‌లో మండియ (రాగులు)లతో తయారు చేసే మండియ కేక్, పొడపిట్ట, లస్సీ, మండియ టీ అందుబాటులో ఉంటాయన్నారు. ప్రజలు మిలెట్ శక్తి కేఫ్‌లలో కొనుగోలు చేసి చేయూత ఇవ్వాలన్నారు. కేఫ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో గౌరవ అతిథిగా మున్సిపల్ చైర్మన్ నరేంద్రకుమార్ మహంతి, జయపురం సబ్ కలెక్టర్, మున్సిపల్ కార్యనిర్వాహక అధికారి కుమారి అక్కవరం శొశ్య రెడ్డి, సీడీపీవో కాంచన పండ, మున్సిపల్ సహాయ కార్యనిర్వాహక అధికారి కృతిబాస్ సాహు, మున్సిపల్ ఇంజినీర్ అజయ జాని, చైతన్య బాసెకె పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆరో రోజు ఒకరు డిబార్

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలు పకడ్బందీగా సాగుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా 75 కేంద్రాల్లో జరుగుతున్న పరీక్షల్లో భాగంగా 6వ రోజు శుక్రవారం సెకండియర్ విద్యార్థులు సెట్-2 ప్రశ్న పత్రంతో మాథ్స్ 2ఎ, బోటనీ, సివిక్స్ పేపర్-2, ఇతర ఒకేషనల్ పేపర్లకు పరీక్ష రాశారు. జనరల్, ఒకేషనల్ రెండు విభాగాల్లో కలిపి 18763 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా 385 మంది గైర్హాజరయ్యారు. 6వ రోజు జిల్లాలో ఒక మాల్‌ప్రాక్టీసు కేసు నమోదైంది. పొందూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సెకెండియర్ మాథ్స్ 2ఏ పరీక్ష రాస్తున్న ఒక విద్యార్థి మాల్‌ప్రాక్టీసుకు పాల్పడుతూ పట్టుబడటంతో అధికారులు డీబార్ చేశారు.

రెండు టన్నుల చింతపండు పట్టివేత

సారవకోట: మండలంలోని వడ్డినవలస గ్రామ సమీపంలో శుక్రవారం ఒడిశా రాష్ట్రం గుణుపురం నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా తీసుకొస్తున్న చింతపండు వ్యాన్‌ను అటవీ శాఖ ఎస్ఎఫ్ఓ ఈశ్వరరావు పట్టుకున్నారు. సుమారు 2 టన్నుల చింతపండును గుణుపురం నుంచి నరసన్నపేటకు తీసుకొస్తున్నట్లు గుర్తించారు. అనుమతులు లేకపోవడంతో వ్యాన్‌ను అదుపులోకి తీసుకున్నారు.నరసన్నపేటకు చెందిన ఒక వ్యాపారి నిత్యం ఇదే మార్గంలో ఒడిశా నుంచి చింతపండు తీసుకొస్తున్నట్లు తెలుస్తోంది.

తెరుచుకోని గ్యాస్ గోదాం



గోదాం నుంచి వెనుదిరుగుతున్న లబ్ధిదారులు

పొందూరు రూరల్: పొందూరులో గ్యాస్ ఇబ్బందులు తప్పడం లేదు. గత వారం రోజులుగా గ్యాస్ లభించకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్యాస్ బుక్ చేసినప్పటికీ ఇవ్వటం లేదు. గోదాం దగ్గరకు వచ్చి తీసుకుందామంటే తాళాలు వేసి ఉంటున్నాయి. గ్యాస్ గోదాం దగ్గరకు వచ్చిన లబ్ధిదారులు తమ గోడును వినిపించుకుంటున్నారు. శుక్రవారం రాపాక, పిల్లలవలస, ఎరుకులపేట, పొందూరుకు చెందిన పలువురు లబ్ధిదారులు గ్యాస్ గోడౌన్‌కు వచ్చి ఉసూరుమని తిరిగి వెనుకకు ఖాళీ సిలిండర్లతో వెళ్లిపోయారు.

దుర్గమ్మ ఆలయంలో చోరీ



చోరీ జరిగిన ఆలయం ఇదే

వజ్రపుకొత్తూరు: మండలంలోని సుంకర జగన్నాథపురం దుర్గమ్మ తల్లి ఆలయంలో గురువారం అర్ధరాత్రి దొంగలు పడ్డారు. తాళాలు పగులుగొట్టి వెండి, బంగారం నగలు ఎత్తుకెళ్లారు. శుక్రవారం ఉదయం దాసురాలమ్మ గాడి హైమావతి ఆలయం వద్దకు రాగా.. తాళం పగలుగొట్టి ఉండటంతో చోరీ జరిగినట్లు గుర్తించి గ్రామస్తులకు సమాచారం అందించారు. ఆభరణలు మాయం కావడంతో వజ్రపుకొత్తూరు పోలీసులకు సమాచారమిచ్చారు. చోరీలో రెండు కిలోల బరువు కలిగిన వెండి పల్లెం, అమ్మవారి విగ్రహం, కిరీటం, బల్లెం, గ్లాసు, రెండు తులాల బంగారం శతమానాలు, ముక్కు పుడకలు, కాసులను దొంగలు ఎత్తుకెళ్లినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. పూండి - నౌపడ ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న దేవాలయం కావడంతో దొంగలు రెక్కీ నిర్వహించి చోరీకి పాల్పడినట్లు తెలుస్తోంది. వజ్రపుకొత్తూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డయాలసిస్ బెడ్లు పెంచాలి



కవిటిలో విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేత పిరియా సాయిరాజ్

కవిటి: కిడ్నీ వ్యాధిగ్రస్తులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం డయాలసిస్ బెడ్ల సంఖ్య పెంచాలని ఇచ్ఛాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నేత పిరియా సాయిరాజ్ డిమాండ్ చేశారు. శుక్రవారం కవిటిలో మండల కన్వీనర్ కడియాల ప్రకాష్ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధానంగా కవిటి మండలంతో పాటు చాలా కేంద్రాల్లో డయాలసిస్ కోసం వేచి చూసే రోగులసంఖ్య అధికంగా ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం సానుకూల దృక్పథంతో డయాలసిస్ బెడ్‌ల సంఖ్య పెంపు దిశగా ఆలోచన చేయాలని కోరారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ప్రమాణస్వీకారం చేసిన తర్వాత పింఛన్లను రూ.10వేలకు పెంచాలని గుర్తు చేశారు. కవిటిలో పదిలోపు ఉన్న బెడ్‌ల సంఖ్యను 19కు పెంచిన విషయాన్ని తెలిపారు. ఇచ్ఛాపురంలో డయాలసిస్ సెంటర్ కూడా ఏర్పాటు చేశారని, దాన్ని ప్రారంభించాలన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నేతలు కడియాల ప్రకాష్, జల్లు యుగంధర్ పాల్గొన్నారు.

రాష్ట్రంలో అధునాతన పోలీసు ఠాణాలు: సీఎం



పోలీసు ఠాణా కొత్త భవనం ప్రారంభించిన ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి



నయాపల్లి ఠాణాలో సౌకర్యాల్ని పరిశీలించిన ముఖ్యమంత్రి

భువనేశ్వర్: రాష్ట్ర వ్యాప్తంగా అధునాతన పోలీసు ఠాణాలు అందుబాటులోకి వస్తాయని, ఠాణాకు విచ్చేసే ప్రతి ఒక్కరికి మౌలిక సౌకర్యాలతో కూడిన సదుపాయాలు రాత్రింబవళ్లు అందుబాటులో ఉంటాయని రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి తెలిపారు. స్థానిక నయాపల్లి ప్రాంతంలో కొత్తగా నిర్మించిన పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో కొత్తగా నిర్మించిన మరో 13 పోలీస్ స్టేషన్ భవనాలను ముఖ్యమంత్రి ప్రారంభించి ప్రజలకు అంకితం చేశారు. ఈ 14 పోలీస్ స్టేషన్లను రూ. 41 కోట్ల 99 లక్షల 59 వేలు వెచ్చించి నిర్మించారు. పోలీసు అధికారులు మరింత సమర్థంగా విధులు నిర్వహించేందుకు వీలుగా అత్యాధునిక మౌలిక సదుపాయాలు, పటిష్టమైన సాంకేతికత వ్యవస్థతో తీర్చిదిద్దారు. ఠాణాలకు విచ్చేసే వారి పట్ల పోలీసుల సత్ప్రవర్తన అత్యంత కీలకమని ముఖ్యమంత్రి పోలీసు అధికారులు, సిబ్బందికి హితవు పలికారు. సకాలంలో సముచిత సేవలు అందజేసి న్యాయసమ్మతంగా పోలీసు సేవలు అందజేయాలని తెలిపారు. ఠాణాలో సత్ప్రవర్తన ప్రజల్లో అవాంఛనీయ భయాందోళనలు తొలగించి నేర సంఘటనల నియంత్రణకు తోడ్పడే సానుకూల పరిస్థితులు అక్కరకు వస్తాయని తెలిపారు.

తారలు దిగి వచ్చిన వేళ



జగదల్‌పూర్ ఎయిర్ పోర్టులో మహేష్ బాబు



పృథ్వీరాజ్‌ని ఆహ్వానిస్తున్న పోలీసు ఉన్నతాధికారులు

కొరాపుట్: తెలుగు సినీ తారలు కొరాపుట్ జిల్లాకు దిగివచ్చారు. తెలుగు సినీ సూపర్ స్టార్ మహేష్ బాబు, మలయాళ హీరో పృథ్వీరాజ్ సుకుమారన్‌లు ఇక్కడ మెరిశారు. కొరాపుట్ జిల్లా సిమిలిగుడ పట్టణంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో దిగారు. రాజమౌళి సినిమా షూటింగ్ కోసం వీరు ఇక్కడకు వచ్చారు. ఇక్కడ షూటింగ్ చేయడంపై కలెక్టర్ కీర్తి వాసన్ ఆనందం వ్యక్తం చేశారు. షూటింగ్‌కు అన్ని విధాలా సహకరిస్తామన్నారు.



కొరాపుట్ జిల్లా కలెక్టర్ వి.కీర్తి వాసన్

నవజీవన్ ట్రస్టులో మహిళా దినోత్సవం



కవితా మల్లిక్‌ను సత్కరిస్తున్న దృశ్యం



మాట్లాడుతున్న జిల్లా సంక్షేమ శాఖ అధికారి మనోరమా దేవి

పర్లాకిమిడి: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని డోలా ట్యాంకు రోడ్డులో ఉన్న నవజీవన అనాథాశ్రమంలో 'జస్టిస్ కార్నర్'ట్రస్టు ఆధ్వర్యంలో మహిళల హక్కులపై ప్రత్యేక కార్యక్రమం శుక్రవారం జరిగింది. ముఖ్యఅతిథిగా జిల్లా సంక్షేమ శాఖ అధికారి మనోరమా దేవి, డీసీపీయూ అరుణ్ కుమార్ త్రిపాఠి, జిల్లా సురక్షా అధికారిని సరలాపాత్రో, జువనైల్ కోర్టు సభ్యులు రవీంద్ర కుమార్ పాల్, మహిళా న్యాయవాది అనితా కుమారీ మిశ్రా, ఆకాంక్ష సంఘటన్ కార్యదర్శి మీనా కుమార్ టోహోలో, శక్తిసాధన్ సూపరింటెండెంటు మంజులా ఆచార్య, సీసీడీ సంస్థ కార్యదర్శి అట్టాడ జగన్నాథరాజు, సఖీ ఒన్ స్టాప్ సెంటర్ సునీతా మహారాణా, అంగన్‌వాడీ, మహిళా స్వయం సహాయక గ్రూపు మహిళలు పాల్గొన్నారు. మహిళా సాధికారత కోసం మనమంతా పోరాడాలని, బాల్యవివాహాలు, గృహహింస, మహిళలపై అనుచిత ప్రవర్తన, అక్రమరవాణా అరికట్టాలని, జసిస్ కార్నర్ అధ్యక్షులు భాగ్యలక్ష్మి నాయక్ అన్నారు. మహిళలు సమాజంలో మూల స్తంభాలని, వారి స్వశక్తీకరణ, భద్రత కోసం మహిళలంతా కలిసి పనిచేయాలని జిల్లా సంక్షేమ శాఖ అధికారి మనోరమా దేవి అన్నారు. ఈ సందర్భంగా మహిళల భద్రత, స్వశక్తీకరణపై నిస్వార్థ సేవలకు గాను కవితా మల్లిక్‌కు జసిస్ కార్నర్ అధ్యక్షులు భాగ్యలక్ష్మి నాయక్ ఆధ్వర్యంలో సత్కారం చేశారు. కార్యక్రమానికి జస్టిస్ కార్నర్ ట్రస్టు సభ్యులు సంజయ్ కుమార్ రౌత్, కార్యదర్శి జగన్నాథ చౌదరి పాల్గొన్నారు.

సమాన హక్కులు కల్పించాలి



కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

జయపురం: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం చైల్డ్ ఫండ్ విభాగం ద్వారా జయపురం సమితి గౌడొపాదర్, టంకువ గ్రామాలలో ప్రత్యేక కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా 'మహిళలు- బాలికల అధికారం- సమానత్వం'అనే అంశంపై చర్చ జరిగింది. కార్యక్రమంలో కిశోరీ స్వయం సహాయక గ్రూపు సభ్యులు, అంగన్‌వాడీ వర్కర్లు, హెల్త్ వర్కర్లు, పీఈవో, వార్డు మెంబర్లు, పలువురు మహిళలు పాల్గొన్నారు. పీఈవో శునాలీ పండ మాట్లాడుతూ.. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శనివారం నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. మహిళల సాధికారిత, హక్కులు, సమాజంలో సమానత్వంపై ఆమె ప్రసంగించారు. మహిళలు విద్య, ఆర్థిక రంగాలలో ప్రగతి సాధిస్తే సమాజం అభివృద్ధి సాధిస్తోందన్నారు. కార్యక్రమాలలో గౌడొపాదర్ పంచాయతీ సర్పంచ్ హీరామణి భూమియ, టంకువ గ్రామ పంచాయతీ సర్పంచ్ రుక్మిణీ గదబ, పీఈవో రమణీరంజన్ త్రిపాఠీ, ఐసీడీఎస్ సూపరింటెండెంట్ సంధ్యారాణి సతనమ్, హెల్త్ వర్కర్ బందిత తరాసియ, అరుందతీ బిశ్వాస్, సివిల్ సప్‌లై సహాయకులు జగన్నాథ్ హరిజన్, చైల్డ్ ఫండ్ కోఆర్డినేటర్ పూర్ణిమ దాస్, అంశుమాన్ మఝి, సుమన్ కుమార్ నాయిక్, ధార్మికా నాయిక్, సీతామణి హంతాల్, ప్రసన్న నాగ్ పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో ఎల్లమ్మ జాతర



పోటెత్తిన భక్త జనం



ఎల్లమ్మకు పూజలు చేస్తున్న భక్తులు

జయపురం: జయపురంలో ఎల్లమ్మ తల్లి జామి యాత్రను శుక్రవారం ఘనంగా జరిగింది. స్థానిక బంకమతం ప్రాంతంలో సాయంత్రం జరిగిన పూజలో పిల్లలకు తోడ్కొని వచ్చి మహిళలు పూజలు జరిపారు. ఎల్లమ్మ తల్లికి పూజలు చేసేందుకు భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా పెద్ద జాత్ర జరిగింది.

హోటళ్లపై విస్తృత దాడులు



సీజ్ చేసిన వంట గ్యాస్ సిలిండర్లు

రాయగడ: సబ్ కలెక్టర్ ఆదేశానుసారం జిల్లా పౌరసరఫరాల శాఖ అదనపు అధికారి సుధాంశు భొయ్ నేతృత్వంలో పట్టణంలో గల పలు హోటళ్లపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో అక్రమంగా వినియోగిస్తున్న 19 వంట గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. ఇందులో భాగంగా స్థానిక ఇంజినీరింగ్ వర్క్స్ షాపులో అధికారులు నిర్వహించిన దాడుల్లో గ్యాస్ వెల్డింగ్‌లకు సంబంధించి కమర్షియల్ గ్యాస్ సిలిండర్లకు బదులు వంట గ్యాస్ సిలిండర్లను వినియోగిస్తున్నట్లు గుర్తించిన అధికారులు ఈ మేరకు వంట గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా స్థానిక గ్రాండ్ డిలైట్ హోటల్‌లో 5, అంబికా హోటల్‌లో 2, నవీన్ హోటల్‌లో 2, జయహనుమాన్ హోటల్‌లో 5, సంతోషి హోటల్‌లో 2, అంగ్రొ ఇంజినీరింగ్ షాపులో మరో రెండు సిలిండర్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

బార్ అసోసియేషన్ ఎన్నికలకు 4 నామినేషన్లు



నామినేషన్లు వేస్తున్న న్యాయవాదులు

జయపురం: జిల్లా బార్ అసోసియేషన్‌కు జరగనున్న ఎన్నికల ప్రక్రియలో భాగంగా నామినేషన్ పర్వంలో రెండో రోజైన శుక్రవారం నాలుగు నామినేషన్‌లు దాఖలయ్యాయి. తొలి రోజున ఆరు నామినేషన్లు దాఖలైన విషయం విదితమే. రెండో రోజున కార్యదర్శి పదవికి న్యాయవాది శరత్ కుమార్ మఝి(పింటు) నామినేషన్‌ను ఎన్నికల అధికారి దాసరథి పట్నాయక్‌కు అందజేశారు. ట్రెజరర్ పదవికి శైలేష్ కుమార్ ముదులి, కార్యవర్గ సభ్యుల పదవులకు సురేష్ కుమార్ సెట్టి, తరణి పాణిగ్రహిలు నామినేషన్‌లు దాఖలు చేశారు. కార్యక్రమంలో ప్రధాన ఎన్నికల అధికారి దాసరథి పట్నాయక్, అసిస్టెంట్ ఎన్నికల అధికారులు పద్మిణి దాస్, జ్యోతి రంజన్ పూజారి సహకరించారు.

ఈశాన్య రాష్ట్రాల్లో కొరాపుట్ ఎంపీ పర్యటన



కోహిమా యుద్ధ వీరుల స్మారక స్థూపం వద్ద సప్తగిరి ఉల్క

కొరాపుట్: కాంగ్రెస్ పార్టీకి చెందిన కొరాపుట్ పార్లమెంట్ సభ్యుడు సప్తగిరి శంకర్ ఉల్క ఈశాన్య రాష్ట్రాల్లో పర్యటిస్తున్నారు. శుక్రవారం ఆ ప్రాంత నాయకులతో సమీక్ష సమావేశాలు నిర్వహించారు. మణిపూర్ రాష్ట్ర రాజధాని ఇంఫాల్‌లో ప్రదేశ్ కాంగ్రెస్ కార్యాలయంలో సమావేశాలు నిర్వహించారు. నాగాలాండ్ రాష్ట్ర పీసీసీ కార్యాలయంలో ఉల్క కి ఘన స్వాగతం లభించింది. కోహిమా యుద్ధ వీరుల స్మారక స్థూపం వద్ద నివాళులు అర్పించారు. త్రిపుర రాష్ట్రం లో ఉల్క పర్యటన ఉంటుందని పార్టీ వర్గాలు ప్రకటించాయి.



నాగాలాండ్‌లో ఉల్కకి స్వాగతం పలుకుతున్న కాంగ్రెస్ నాయకులు

ప్రభుత్వ నిర్ణయం ఉపసంహరణకు బీజేడీ అభ్యర్థన



రాజ్ భవన్‌కు ఊరేగింపుగా వెళ్లిన బీజేడీ నాయకులు

భువనేశ్వర్: దివంగత ముఖ్యమంత్రి బిజూ పట్నాయక్ జయంతి నాడు జరుపుకుంటున్న పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని బీజేపీ ప్రభుత్వం ఏప్రిల్ 24న నిర్వహించేందుకు మార్పు చేసింది. దీంతో బిజూ జనతా దళ్ ఉగ్ర రూపం దాల్చింది. శుక్రవారం ప్రారంభమైన శాసన సభ మలి విడత బడ్జెటు సమావేశాల్లో బీజేడీ సభ్యులు తీవ్ర నిరసన ప్రదర్శించారు. దీంతో సభా కార్యక్రమాలకు గండి పడింది. సభా కార్యక్రమాలు వాయిదా పడడంతో ఊరేగింపుగా బీజేడీ నాయకులు రాష్ట్ర గవర్నరుని కలిసేందుకు రాజ్ భవన్ సందర్శించారు. ఈ సందర్భంగా రాష్ట్ర గవర్నరు డాక్టరు హరిబాబు కంభంపాటికి స్మారక పత్రం సమర్పించారు. మార్చి 3న పంచాయతీ రాజ్ దినోత్సవ వేడుకలను మార్చి 5 నుంచి ఏప్రిల్ 24కి మార్చాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని రద్దు చేయాలని బీజేడీ ఎమ్మెల్యేలు తమ మెమోరాండంలో కోరారు.

బిజూ పట్నాయక్ జయంతి పురస్కరించుకుని ఏటా పంచాయతీ రాజ్ దివస్‌గా పాటించాలని 1993 సంవత్సరంలో రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. మూడు అంచెల పంచాయతీ రాజ్ సంస్థల సాధికారతపై దృష్టి సారించేందుకు ప్రతీకగా గత 31 ఏళ్లుగా, 1995 నుంచి 2000 వరకు కాంగ్రెస్ పాలనలో, 2000-2009 వరకు బీజేడీ-బీజేపీ సంకీర్ణ ప్రభుత్వంలో కూడా రాష్ట్రం ఈ దినోత్సవాన్ని పాటిస్తోంది. కొత్త ప్రభుత్వం ఈ సంస్మృతికి తెర దించే ఉత్తర్వుల్ని రద్దు చేసేందుకు గవర్నరు కార్యనిర్వాహక ఉత్తర్వు ద్వారా మంత్రి వర్గ నిర్ణయాన్ని రద్దు చేయాలని గవర్నరుకు అభ్యర్థించింది.

175 మంది పాసింగ్ అవుట్



శిక్షణ పూర్తి చేసిన పోలీసు అధికారులు, సిబ్బందితో ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి

భువనేశ్వర్: స్థానిక బిజూ పట్నాయక్ స్టేట్ పోలీస్ అకాడమీలో 8వ బ్యాచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (డీఎస్పీ), 12వ బ్యాచ్ సబ్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ) శిక్షణ కార్యక్రమం ముగిసింది. ఈ సందర్భంగా శుక్రవారం నిర్వహించిన దీక్షా సమారోహ కార్యక్రమానికి ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి ముఖ్య అతిథిగా హాజరు అయి పరేడ్‌లో గౌరవ వందనం స్వీకరించారు. శిక్షణలో వివిధ అంశాల్లో ప్రతిభ కనబరిచిన ఉత్తమ అభ్యర్థులకు ఆయన ప్రశంసా పత్రాలు, బహుమానాలు ప్రదానం చేశారు. నలుగురు అప్రెంటీస్ డీఎస్పీలు, 171 మంది అప్రెంటీస్ పోలీస్ సబ్-ఇన్‌స్పెక్టర్లు సుదీర్ఘ శ్రమతో ప్రాథమిక శిక్షణను పూర్తి చేసుకుని ఈరోజు పాసింగ్ అవుట్ పరేడ్‌లో పాల్గొన్నారు.



పరేడ్‌లో గౌరవ వందనం స్వీకరించిన ముఖ్యమంత్రి



ఉత్తమ ప్రతిభ ప్రదర్శించిన అభ్యర్థులకు ముఖ్యమంత్రి అభినందన

ఆక్రమణల తొలగింపునకు చర్యలు



మత్స్య శాఖ నిర్మిస్తున్న ప్రహరీ

జయపురం: స్థానిక జగన్నాథ్‌సాగర్ పునరుద్ధరణ, సుందరీకరణ పనులలో భాగంగా సాగర్ స్థలాల ఆక్రమణల తొలగింపునకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో జగన్నాథ్ సాగర్‌కు ఒక పక్కనున్న మత్స్య విభాగ కార్యాలయం ప్రహరీ పడగొట్టేందుకు మున్సిపల్ అధికారులు ఆదేశించారు. జగన్నాథ్ సాగర్ స్థలంలో మత్స్య విభాగ ఆధీనంలోని 45 హెక్టార్ల స్థలం ఉండేది. అందులో ఇప్పటికే 25 హెక్టార్ల స్థలం పట్టణాభివృద్ధి విభాగానికి అప్పజెప్పింది. మిగతా 20 హెక్టార్లను అతిత్వరలో అప్పజెప్పనున్నారు. ఈ నేపథ్యంలో మత్స్య విభాగ అధికారులు లక్షలాది రూపాయల ఖర్చుతో తమ కార్యాలయం చుట్టూ ప్రహరీ నిర్మిస్తున్నారు. పట్టణాభివృద్ధికి అప్పగించాల్సిన స్థలం చుట్టూ ప్రహరీ ఎందుకు కడుతున్నారని జగన్నాథ్ సాగర్ ట్రస్టు సభ్యులు ప్రశ్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం జయపురం సబ్‌కలెక్టర్, మున్సిపల్ కార్యనిర్వాహక అధికారి కుమారి ఎ.శౌశ్య రెడ్డి ఆదేశం మేరకు మల్సిపల్ కార్యనిర్వాహక అధికారి కృతిబాస్ సాహు, జూనియర్ ఇంజినీర్ ప్రతాప్ చంద్ర ఆచార్య, జగన్నాథ్ సాగర్ ట్రస్టు సభ్యులు ఆ ప్రాంతాన్ని సందరిశంచారు. ఆక్రమణల తొలగింపు, పైన, పట్టణంలో మురికి కాల్వల నుంచి సాగర్ లోనికి వస్తున్న నీటిని నిరోధించేందుకు ట్రస్టు సభ్యులు మున్సిపల్ అధికారులతో చర్చించారు.

ఘనంగా దీపారాధన



దీపారాధన చేస్తున్న మహిళా సిబ్బంది

రాయగడ: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన శుభద్ర పథకం ప్రచార కార్యక్రమంలో భాగంగా జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కలక్టర్ కార్యాలయం ప్రాంగణంలో దీపారాధన కార్యక్రమం చేపట్టారు. జిల్లా కలెక్టర్ ఫరూల్ పట్వారి ఆదేశానుసారం జిల్లా అదనపు కలెక్టర్ నిహారి రంజన్ కుహోరో ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయంలో పనిచేస్తున్న మహిళా సిబ్బంది దీపారాధన కార్యక్రమంలో పాల్గొని దీపాలు వెలిగించారు.

విక్రమదేవ్ వర్సిటీ రిజిస్ట్రార్‌గా మహేశ్వర్ నాయిక్ బాధ్యతల స్వీకరణ



రిజిస్ట్రార్‌గా బాధ్యతలు చేపట్టిన మహేశ్వర్ నాయిక్‌కు స్వాగతం పలుకుతున్న సిబ్బంది

జయపురం: జయపురం విక్రమదేవ్ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌గా మహేశ్వర నాయిక్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల విద్యాప్రగతికి కృషి చేస్తానన్నారు. విద్యార్థులలో క్రమశిక్షణ నెలకొల్పి ఆదర్శ విశ్వవిద్యాలయంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని చెప్పారు. మహేశ్వర్ నాయిక్ ఓఏఎస్ అధికారి. బాధ్యతలు చేపట్టిన ఆయనకు సిబ్బంది పుష్ప గుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. పూర్వ రిజిస్ట్రార్ రంజన్ కుమార్ ప్రధాన్, విక్రమదేవ్ హయ్యర్, సెకండరీ కళాశాల ప్రిన్సిపాల్ కెప్టెన్ డాక్టర్ లక్ష్మణ పాత్రో పాల్గొన్నారు.

ఫార్మసీ, నర్సింగ్ విభాగాల్లో మంచి అవకాశాలు



విద్యార్థుల నృత్య ప్రదర్శనలు

రాయగడ: వైద్య రంగంలో పలు సేవలను అందించాలనే ఉద్దేశంతో ఫార్మసీ, నర్సింగ్ విభాగాల్లో చదువుకున్న విద్యార్థులు వారి లక్ష్యానికి అనుగుణంగా వచ్చే అవకాశాలను సద్వినియోగపరుచుకోవాలని డాక్టర్ చంద్ర శేఖర్ పాత్రో అన్నారు. స్థానిక పితామహల్ వద్ద గల సెంచ్యూరియన్ విశ్వవిద్యాలయంలో ఆఖరి సంవత్సరం చదువుకుని వెళుతున్న ఫార్మసీ, నర్సింగ్ విభాగాలకు చెందిన విద్యార్థుల వీడ్కోలు సమావేశం విశ్వవిద్యాలయం ప్రాంగణంలో శుక్రవారం జరిగింది. కార్యక్రమంలో ఫార్మసీ విభాగం అధ్యక్షులు డాక్టర్ పాత్రో మాట్లాడారు. ఫార్మసీ, నర్సింగ్ రంగాల్లో ప్రభుత్వం ఎన్నో అవకాశాలను కల్పిస్తుందని వివరించారు. వైద్యరంగంలో కొత్త పుంతలు తొక్కుతున్న ఈ రోజుల్లో ఉపాధి అవకాశాలు పుష్కలంగా లభిస్తాయని అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నర్సింగ్ విభాగం అధ్యక్షులు కె.ఉర్మిల, అధ్యాపకులు గోపాలక్రిష్ణ పాఢి ప్రసంగించారు.

క్లుప్తంగా

10న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా

సాలూరు: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో ఈ నెల 10న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఉషశ్రీ, జేకేసీ కో ఆర్డినేటర్ రాంబాబులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. దివిస్ ల్యాబొరేటరిస్ లిమిటెడ్ హైదరాబాద్, విశాఖపట్నం, కాకినాడ సమీపంలో ఉన్న బల్క్‌డ్రగ్ ప్రొడక్షన్ విభాగంలో పనిచేసేందుకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారని పేర్కొన్నారు. ట్రైనీ సూపర్‌వైజర్, గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌లకు బీఎస్సీ కెమిస్ట్రీ, బీఫార్మసీ, బీటెక్(కెమికల్). ఎంఎస్సీ (ఆర్గానిక్ కెమిస్ట్రీ),అనలిటికల్ కెమిస్ట్రీ, ఎం ఫార్మసీ చేసిన వారు అర్హులని తెలిపారు.పై కోర్సులు పూర్తిచేసిన లేదా ఆఖరి సంవత్సరం చివరి సెమిస్టర్ చదువుతున్న అభ్యర్థులు ఒరిజనల్ సర్టిఫికెట్స్, జిరాక్స్‌లను తీసుకుని ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు.

డీఎస్సీ, ఎస్జీటీకి ఆన్‌లైన్‌లో ఉచిత శిక్షణ

విజయనగరం టౌన్: వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆంధ్రప్రదేశ్ ఆదేశాల మేరకు డీఎస్సీ, ఎస్జీటీ పరీక్షకు అర్హులైన జిల్లాకు చెందిన బీసీ, ఈడబ్ల్యూఎస్, ఈబీసీ వర్గాలకు చెందిన అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్‌లో ఉచిత శిక్షణకు దరఖాస్తులు కోరుతున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ జి.పెంటోజీరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 10వతేదీ నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. అభ్యర్థుల వార్షిక ఆదాయం రూ.రెండు లక్షల లోపు ఉండాలని స్పష్టం చేశారు. ఉచిత ఆన్‌లైన్ శిక్షణకు డిగ్రీ మార్క్‌లిస్ట్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, నేటివిటీ, డీఎస్సీకి ఎంపికైన టెట్ మార్క్స్, జిరాక్స్ పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు రెండు దరఖాస్తుతో జతచేయాలని సూచించారు. మరిన్ని వివరాలకు ఫోన్ 9603557333, 9177726454 నంబర్లను సంప్రదించాలని కోరారు.

సేవా పతకాలు అందజేసిన కమాండెంట్ మల్లికా గార్గ్



సేవా పతకాలు అందుకున్న వారితో బెటాలియన్ కమాండెంట్ మల్లికాగార్గ్

డెంకాడ: ఉత్కృష్ట, అతి ఉత్కృష్ట సేవా పతకాలను ఐదవ ఏపీఎస్పీ బెటాలియన్ పోలీస్‌అధికారులు, సిబ్బందికి కమాండెంట్ మల్లికా గార్గ్ అందజేశారు. చింతలవలస ఐదవ ఏపీఎస్పీ బెటాలియన్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో 2019లో 12, 2020లో 9, 2023లో 13 ఉత్కృష్ట సేవా పతకాలకు ఎంపికైన బెటాలియన్ పోలీస్ అధికారులు, సిబ్బందికి కమాండెంట్ చేతుల మీదుగా అందజేశారు. అలాగే 2019వ సంవత్సరంలో 7, 2020లో 4, 2023లో 7 అతి ఉత్కృష్ట పతకాలను అందజేశారు. పదిమందికి యాంత్రిక్ సేవా పతకాలను అందించారు. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ డి.వెంకటేశ్వరరావు,అసిస్టెంట్ కమాండెంట్‌లు పి.సత్తిబాబు ు,ఎస్.బాపూజీ, డీవీ రమణమూర్తి,, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

41 గ్యాస్ సిలిండర్ల సీజ్



సివిల్ సప్లయిస్ అధికారులు స్వాధీనం చేసుకున్న సిలిండర్లు

విజయనగరం ఫోర్ట్: జిల్లాలో డొమెస్టిక్ సిలిండర్లను అక్రమంగా వాడుతున్న హోటల్స్, రెస్టారెంట్స్, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్స్‌పై సివిల్ సప్లయిస్ అధికారులు శుక్రవారం ఆకస్మికంగా దాడులు చేశారు. సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహసీల్దార్లు రెండు బృందాలుగా ఏర్పడి తనిఖీలు నిర్వహించారు. విజయనగరం, డెంకాడ, గజపతినగరం మండలాల్లో 8 చోట్ల 6ఎ కేసులు నమోదు చేసి 25 సిలిండర్లు సీజ్ చేశారు. అదేవిధంగా చీపురుపల్లి, రాజాం, గరివిడి మండలాల్లో 7 చోట్ల ఏడు 6 ఎ కేసులు నమోదు చేసి 16 సిలిండర్లను సీజ్ చేశారు.

నైపుణ్యాలు కలిగిన యువతతో గ్రామీణాభివృద్ధి

- గిరిజన యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ టి.వి.కట్టిమణి

విజయనగరం అర్బన్: నైపుణ్యాలు కలిగిన యువతతో గ్రామీణాభివృద్ధి సాధించవచ్చని కేంద్రీయ గిరిజన యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ టీవీ కట్టిమణి అన్నారు. వర్సిటీలో 'ఎంటర్‌ప్రెన్యూర్ షిప్ ద్వారా గ్రామీణాభివృద్ధి సాధికారపరచడం' అనే అంశంపై శుక్రవారం జరిగిన సదస్సును ఆయన ప్రారంభించారు. గ్రామీణాభివృద్ధిలో వ్యవస్థాపకత ప్రాముఖ్యతను తెలియజేశారు. నైపుణ్య అభివృద్ధి, స్థిరమైన పద్ధతులతో జనాభాను శక్తివంతంచేసే సహాయక కార్యక్రమాలకు వర్సిటీ ప్రాధాన్యమిస్తోందన్నారు. ప్రొఫెసర్ విష్ణుకాంత్ ఎస్.చాట్పల్లి మాట్లాడుతూ జీవనోపాధి మార్గాలను మెరుగుపరుచుకునేందుకు వ్యవస్థాపక వ్యూహాలను గ్రామీణ యువత అనుసరించాలన్నారు. కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ (ఎస్ఎంఎస్) డీన్, ప్రొఫెసర్ జితేంద్రమోహన్ మిశ్రా, బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం అధిపతి డాక్టర్ ఎ.వి.అప్పసాబా పాల్గొన్నారు.

రేపటికి ముందడుగు

ఆత్మవిశ్వాసమే ఆభరణం



మహిళకు ఆత్మవిశ్వాసమే అసలైన ఆభరణం. మొక్కవోని కార్యదీక్ష, ఓర్పు, నేర్పు, శక్తియుక్తి వంటి లక్షణాలే తరగని ఆభరణాలు. మగవారికి మకుటమై మణిమాణిక్యమై మనుగడకే మణిదీపమై వెలుగులీనే వేగు చుక్క నేటి మహిళ. విధివంచితలైనా, విజయభేరి మోగించే నేటిమహిళ పురుషుల కన్నా మహాశక్తి కలది.సమాజంలోని ఆటుపోట్లను ఎదుర్కొని ముందడుగు వేసే ప్రతిమహిళకు అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు.

– కోరుపోలు కళావతి, ప్రముఖ రచయిత్రి, విజయనగరం

అన్నిరంగాల్లోనూ మహిళలు రాణించాలి



నేటి మహిళలందరూ ప్రతి రంగంలోనూ రాణించాలి. ఉన్నతమైన లక్ష్యాలతో ముందుకు వెళ్లాలి. భవిష్యత్తుకు మార్గం వేయాలి. కుటుంబసభ్యుల ప్రోత్సాహం తప్పనిసరిగా ఉండాలి. కుటుంబాన్ని బ్యాలెన్స్ చేసే విషయంలో మహిళలు నైపుణ్యం ఎలా ప్రదర్శిస్తారో..ఉద్యోగ విషయంలోనూ ఎటువంటి పరిస్థితినైనా సమర్థవంతంగా ఎదుర్కొని దానికి చక్కటి పరిష్కారం చూపించ గలుగుతారు. వృత్తిపట్ల నిబద్ధతతో పనిచేయగలుగుతారు. మహిళా మణులందరికీ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు.

– కె.శిరీష, జిల్లా దేవాదాయశాఖ అధికారిణి, విజయనగరం

మహిళా క్రీడాపోటీలతో ఆనందం



ఖోఖో పోటీలో తలపడుతున్న ఉద్యోగినులు



జెండా ఊపి క్రీడలను ప్రారంభించిన విజయనగరం ఆర్‌డీఓ దాట్ల కీర్తి

విజయనగరం అర్బన్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఏపీఎన్జీవో జిల్లా మహిళా విభాగం ఆధ్వర్యంలో స్థానిక రాజీవ్ స్టేడియంలో శుక్రవారం జరిగిన క్రీడా పోటీలు మహిళా ఉద్యోగుల్లో ఆనందం నింపాయి. తొలుత పోటీలను విజయనగరం ఆర్‌డీఓ దాట్ల కీర్తి గాల్లో బెలూన్‌లు ఎగరవేసి జెండా ఊపి ప్రారంభించారు. ప్రభుత్వ శాఖల్లో పనిచేసిన మహిళా ఉద్యోగులు అధికసంఖ్యలో ఉత్సాహవంతంగా పాల్గొని పోటీల్లో ప్రతిభ చూపారు. కబడ్డీ, ఖోఖో, టెన్నికాయిట్, షటిల్ బాడ్మింటన్, మ్యూజికల్ చైర్ తదితర క్రీడల్లో అధిక సంఖ్యలో మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు. పోటీలను కె.భాను, పి.అదిలక్ష్మి, వి.సౌదామిని, ఎస్.విజయలక్ష్మి, పి.భారతీదేవి, అనురాధ నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్జీవో రాష్ట్ర ఉపాధ్యక్షుడు డీవీరమణ, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టి.శ్రీధర్‌బాబు, ఎ.సురేష్, జీవీఆర్ఎస్‌కిశోర్, వై.ఆనంద్‌కుమార్, గోపీనాథ్, జిల్లా కోశాధికారి ఎస్‌వీసుధాకర్, ఎ.కనకరాజు, ఎల్.తవుడు, కేవీశ్రీను, జిల్లా మహిళా విభాగం చైర్‌పర్సన్ కె.ఆదిలక్ష్మి, ఆర్.శ్రీసప్న, కె.రాధిక, మహిళా కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్

- జాతీయ స్కూల్‌గేమ్స్‌లో పాల్గొన్న క్రీడాకారులకు సర్టిఫికెట్ల ప్రదానం



విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న దృశ్యం

విజయనగరం: విద్యార్థి దశలో క్రీడల్లో రాణించిన వారికి ఉజ్వల భవిష్యత్ ఉంటుందని జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.శ్రీనివాసమూర్తి, జిల్లా విద్యాశాఖ అధికారి యు.మాణిక్యం నాయుడులు పేర్కొన్నారు. జాతీయస్థాయిలో జరిగిన స్కూల్‌గేమ్స్ పోటీల్లో రాష్ట్ర జట్టుకు విజయనగరం జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన 28 మంది క్రీడాకారులకు శుక్రవారం సర్టిఫికెట్లు ప్రదానం చేసారు. స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో జిల్లా నుంచి ఖోఖో, కబడ్డీ, స్విమ్మింగ్, సాఫ్ట్ బాల్, బేస్‌బాల్, సైక్లింగ్, తైక్వాండో, రెజ్లింగ్ పోటీల్లో రాష్ట్ర జట్లలో 28 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వారిని ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారితో పాటు, విద్యాశాఖ అధికారులు అభినందించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ క్రీడల ద్వారా మంచి భవిష్యత్ అందిపుచ్చుకోవచ్చన్నారు. జాతీయస్థాయి సర్టిఫికెట్‌తో ఉద్యోగావకాశాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మంచి భవిష్యత్ ఏర్పాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో హెచ్ఎం అసోసియేషన్ కార్యదర్శి సన్యాసిరాజు, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం కార్యదర్శి ఎన్.వెంకటనాయుడు, ఎస్ జీఎఫ్ జిల్లా కార్యదర్శి కె.కృష్ణంరాజు, వ్యాయామ ఉపాధ్యాయులు కేవీఎవ్ రాజు, చంద్రశేఖర్, సూర్యారావు, తాడుబాబు, సత్యనారాయణ, అప్పలనాయుడు, శ్రీను, టి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార కోసమే చైతన్యయాత్రలు

- సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ

విజయనగరం గంటస్తంభం: సీపీఎం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించ తలపెట్టిన ప్రజాచైతన్య యాత్రల్లో ప్రజాసమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి పోరాటాలు చేస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన స్థానిక ఎల్‌బీజీ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ సైకిల్‌యాత్రగా విజయనగరం నుంచి బయలుదేరి మండలంలోని వివిధ గ్రామాల్లో పర్యటించి ప్రజలను కలిసి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుంటామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా, జిల్లా వ్యాప్తంగా అనేక సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కారం చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. మండలాలు, పట్టణ ప్రాంతాల్లో పాదయాత్రలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారం చేపట్టి 10 నెలలు గడిచినా ఉపాధి కల్పనపై చిత్తశుద్ధి లేదని, ధరలు అదుపులో ఉండడం లేదన్నారు. మరోవైపు కరెంట్ చార్జీల భారం విపరీతంగా ప్రజలపై వేస్తున్నారని విమర్శించారు. సూపర్‌సిక్స్ గురించి గొప్పగా చెప్పడం తప్ప ఏ ఒక్క హామీ అమలు చేయకపోగా, సంక్షేమ పథకాల్లో కోత విధిస్తున్నారన్నారు. విజయనగరం జిల్లాలో కూడా తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, వేసవి తీవ్రత పెరగకుండానే తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నామన్నారు. ప్రజలను చైతన్య పరుస్తూ తమయాత్రలు 17 వ తేదీ వరకు జరుగుతాయని తెలియజేశారు. ప్రజలంతా తమ సమస్యలను సీపీఎం దృష్టికి తీసుకురావాలని కోరారు. ప్రజాసమస్యల పరిష్కారానికి ఈనెల 22 నుంచి 28 వరకు వివిధ రూపాల్లో ఆందోళన చేపడతామని స్పష్టం చేశారు. అయినా ప్రభుత్వం స్పందించకపోతే ఏప్రిల్, మే నెలల్లో సమరశీల పోరాటానికి సిద్ధమవుతామని హెచ్చరించారు.

నేడే జాతీయ లోక్ అదాలత్



జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయి కల్యాణ్ చక్రవర్తి

విజయనగరం లీగల్: జాతీయ న్యాయ సేవ అధికార సంస్థ న్యూఢిల్లీ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ ఆదేశాలతో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయి కల్యాణ్ చక్రవర్తి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఉమ్మడి విజయనగరం జిల్లా వ్యాప్తంగా 21 లోక్ అదాలత్ బెంచీలను ఏర్పాటు చేశామని తెలిపారు. రాజీ పడదగిన క్రిమినల్ కేసులను, మోటార్ ప్రమాద బీమా కేసులు, బ్యాంకు కేసులు, చెక్కుబౌన్స్ కేసులు, మనీ కేసులు, ప్రాంసరీ నోట్ కేసులు, ఎలక్ట్రిసిటీ కేసులు, ఎక్సైజ్ కేసులు, ల్యాండ్ కేసులు, కుటుంబ తగాదాలు వాటర్ కేసులు, మున్సిపాలిటీ కేసులు, ప్రి లిటిగేషన్ కేసులు, ఇరుపార్టీల అనుమతితో రాజీ మార్గంలో శాశ్వత పరిస్కారం చేసుకోవచ్చునన్నారు. కక్షిదారులు, ప్రజలు శనివారం జరగనున్న జాతీయ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

బైక్‌పైనుంచి జారి పడి వ్యక్తి మృతి



నాగేశ్వరరావు మృతదేహం


జియ్యమ్మవలస రూరల్: మండలంలోని అలమండ పంచాయతీ నీలకంఠాపురం గ్రామానికి చెందిన కొండగొర్రి నాగేశ్వరరావు(46) బైక్‌పై నుంచి జారిపడి మృతి చెందాడు. ఈ మేరకు చినమేరంగి ఎస్సై పి.అనీష్ తెలిపిన వివరాల మేరకు నీలకంఠాపురం గ్రామానికి చెందిన నిమ్మక శంకర్రావు తన బైక్‌పై అదే గ్రామానికి చెందిన కొండగొర్రి నాగేశ్వరరావు, పాలక లాలిబాబులను ఎక్కించుకుని గురువారం రాత్రి గుమ్మలక్ష్మీపురం మండలం బొద్దిడి గ్రామదేవత పండగకు వెళ్తున్నాడు. ఆ సమయంలో మార్గమధ్యంలో బైక్‌పై నుంచి జారిపడిన నాగేశ్వరరావుకు తీవ్ర గాయాలు కావడంతో 108 సహాయంతో పార్వతీపురం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచాడు. మితిమీరిన వేగంతో వెళ్లడంతోనే ప్రమాదం జరిగిందని, ప్రమాదంలో తమ చిన్నాన్న మృతి చెందాడని కొండగొర్రి అప్పారావు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి...

భోగాపురం: ఈనెల 5వ తేదీన మండంలోని రావివలస ట్రంపెట్ వంతెన కింద ఆగి ఉన్న లారీని ఢీకొని గాయపడిన జోతేంద్ర నారాయణ పాండే (41) చికిత్స పొందుతూ మృతిచెందాడు. విశాఖపట్నానికి చెందిన జోతేంద్ర పాండేను గాయాలపాలైన అనంతరం తగరపువలస ఎన్ఆర్ఐ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స కోసం చేర్చారు. మృతుడి తండ్రి హరినారాయణ పాండే ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ ఎన్వీ ప్రభాకర్ తెలిపారు.

విద్యార్థినులకు లఘుచిత్ర ప్రదర్శన

- ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి



పార్వతీపురం రూరల్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని పార్వతీపురం మన్యం జిల్లా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో విద్యార్థినులకు మహిళల గౌరవాన్ని పెంపొందించే లఘు చిత్రాలను జిల్లా వ్యాప్తంగా ఉన్న పాఠశాలల్లో సంబంధిత స్టేషన్ల సిబ్బంది ద్వారా శుక్రవారం ప్రదర్శించినట్లు ఎస్పీ మాధవ్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు సామాజిక, ఆర్థిక, క్రీడ, రాజకీయ రంగాల్లో సాధించిన ప్రగతిని గురించి విద్యార్థులకు వివరించి మహిళల హక్కులు, వారి శక్తి, సమానత్వం, మానసిక స్థైర్యం, స్వీయ రక్షణ సామర్థ్యాన్ని పెంపొందించడమే లక్ష్యంగా పలు కార్యక్రమాలను గత ఏడు రోజులుగా నిర్వహించామని చెప్పారు. మహిళా చట్టాలు, పోక్సో యాక్ట్, ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్, సామాజిక మాధ్యమాలు, సైబర్ నేరాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తల పరమైన అంశాలపై పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. పోలీసు శాఖ మహిళల రక్షణకు అధిక ప్రాధాన్యం ఇస్తుందని పోలీస్‌సిబ్బంది సహాయ సేవలు 24/7 ఉంటాయన్నారు. అత్యవసర సమయాల్లో హెల్ప్‌లైన్ నంబర్లు చైల్డ్‌హెల్‌లైన్ 1098, ఉమెన్ హెల్‌లైన్ 181, పోలీస్ హెల్‌లైన్ 100/112 సైబర్ నేరాల హెల్ప్‌లైన్ 1930 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

మార్చి 12లోగా వ్యవసాయ పరికరాలకోసం దరఖాస్తు



కె.రాబర్ట్‌పాల్, జిల్లా వ్యవసాయాధికారి

పార్వతీపురం: వ్యవసాయ యాంత్రికరణలో భాగంగా రైతులకు ఆధునిక వ్యవసాయ పరికరాల కోసం రైతు సేవా కేంద్రాల్లో ఈనెల 12లోగా దరఖాస్తు చేసుకుని రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని పార్వతీపురం మన్యం జిల్లా వ్యవసాయాధికారి కె.రాబర్ట్‌పాల్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మాట్లాడుతూ 2024–25 సంవత్సరానికి గాను రైతులకు 50శాతం సబ్సిడీపై వ్యవసాయ పరికరాలను సరఫరా చేసేందుకు పార్వతీపురం మన్యం జిల్లాకు రూ.2.47కోట్ల నిధులు మంజూరైనట్లు తెలిపారు. బ్యాటరీ స్ప్రేయర్‌లు, పుట్ స్ప్రేయర్లు, తైవాన్ స్ప్రేయర్‌లు, ట్రాక్టర్ దుక్కు, దమ్ము సెట్లు, రోటోవేటర్లు, పవర్ వీడర్‌లు, పవర్ టిల్లర్లను అందించనున్నట్లు చెప్పారు. గత ఐదేళ్లుగా వ్యవసాయశాఖ నుంచి సబ్సిడీ ద్వారా పరికరాలు పొందని ఎస్సీ,ఎస్టీ, సన్న, చిన్నకారు మహిళా రైతులు అర్హులన్నారు. ఆర్‌ఓఎఫ్‌ఆర్ భూములను సాగుచేస్తున్న రైతులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. ఏపీ స్టేట్ ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీఎస్ఏఐడీసీ) రైతులతో చర్చించి పరికరాల ధరలను నిర్ణయించి లబ్ధిదారులకు అందించనున్నామని చెప్పారు. ఆసక్తిగల రైతులు వినియోగించుకోవాలని కోరారు.

ఆయుధ భాండాగారంగా బాడంగి ఎయిర్‌స్ట్రిప్

- నావికాదళ సెక్షన్ ఆఫీసర్ చైతన్య
- ఆర్డీఓతో కలిసి భూముల పరిశీలన



బాడంగి రెవెన్యూ కార్యాలయంలో ఆర్డీఓతో మాట్లాడుతున్న నావికాదళ అధికారి చైతన్య

బాడంగి: విజయనగరం జిల్లా బాడంగి సమీపంలోని బ్రిటిష్ కాలంనాటి ఎయిర్‌స్ట్రిప్‌ను విశాఖ నావికాదళ శాఖ ఆయుధ భాండాగారంగా తీర్చిదిద్దేందుకు ఆలోచన చేస్తున్నట్లు నావికాదళ జూనియర్ మేనేజర్, వర్క్స్‌సెక్షన్ ఆఫీసర్ పి.చైతన్య తెలిపారు. ఆర్డీఓ రామ్మోహన్‌రావుతో కలిసి శుక్రవారం సంబంధిత భూములు పరిశీలించారు. ఆయుధ భాండాగారం ఏర్పాటుకు ప్రస్తుతం నావికాదళానికి చెందిన భూమితో పాటు మరో 1613.63 ఎకరాలు అవసరమన్నారు. ఇక్కడ నావెల్ ట్రెనింగ్ పరికరాలు, యుద్ధసామగ్రిని నిల్వ చేస్తామన్నారు. దీనిని నావెల్ ఫీడ్‌రిక్వైర్ మెంట్ జోన్‌గా పిలుస్తామని చెప్పారు. ఇక్కడికి డొంకినవలస రైల్వేస్టేషన్ దగ్గరగా ఉన్నందున విడిపనిముట్లు సరఫరాకు వీలుంటుందన్నారు. రైల్వేస్టేషన్ వరకు ప్రత్యేక రోడ్డును నిర్మిస్తామని, ఇది స్థానిక ప్రజలకు కూడా ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు. ఎయిర్‌స్ట్రిప్ నుంచి నేరుగా పాల్తేరు హైస్కూల్ వరకు రెవెన్యూశాఖ గుర్తించిన భూములను పరిశీలించారు. హైస్కూల్‌కు ప్రత్యామ్నాయ స్థలం కేటాయించి కొత్త భవనాలు నిర్మిస్తామని చెప్పారు. ముగడ, మల్లంపేట, పాల్తేరు, పూడివలస, కోడూరు, రామచంద్రాపురం, మల్లంపేట గ్రామాలకు చెందిన 1585 ఎకరాల భూములను గుర్తించామన్నారు. వీటిలో ప్రభుత్వ, డీ పట్టా, మాగాణి, మెట్ట భూములు, ప్రభుత్వేతర భూములు కలిసి ఉన్నాయన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుధాకర్, సర్వేయర్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

3.25 లక్షల మెట్రిక్ టన్నుల చెరకు క్రషింగ్

రేగిడి: మండలంలోని సంకిలి వద్ద ఉన్న ఈఐడీ చక్కెర కర్మాగారంలో 3.25 లక్షల మెట్రిక్ టన్నుల చెరకు క్రషింగ్ పూర్తయినట్లు కర్మాగారం జనరల్ మేనేజర్ వెంకటసూర్యనారాయణ తెలిపారు. స్థానిక విలేకరులతో ఆయన శుక్రవారం మాట్లాడారు. విజయనగరంతో పాటు శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల నుంచి చెరకును కర్మాగారానికి తరలించామన్నారు. చెరకు తరలించిన వారం రోజుల్లోనే రైతుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమచేస్తున్నట్లు వివరించారు.



కర్మాగారం వద్ద క్రషింగ్‌కు సిద్ధంగా చెరకు

టేకు, మామిడి, జీడిచెట్లు దగ్ధం



కాలిపోయిన చెట్లు

బలిజిపేట: మండలంలోని మిర్తివలస గ్రామసమీపంలో మిర్తివలస, తుమరాడ రెవెన్యూ పరిధిలో ఉండే టేకు, మామిడి, జీడితోటల్లో ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం సంభవించడంతో చెట్లు దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో 18మంది రైతులకు చెందిన సుమారు 2,580టేకుచెట్లు, 307మామిడి, 170జీడి చెట్లు కాలిపోయాయని రైతులు తెలిపారు. ప్రమాదవశాత్తు జరిగిన సంఘటన కావడంతో మంటలు ఆర్పేందుకు అవకాశం లేకవడంతో చెట్లు కాలిపోయాయని రైతులు వాపోయారు. రెవెన్యూ సిబ్బంది నష్టాన్ని అంచనా వేశారని రైతులు తెలిపారు. ఈ ప్రమాదంలో డొక్కర రాము, ప్రగడ సోములయ్య, సాలీల సుశీల, శ్రీరాములు, పోలిరాజు, పైడితల్లి, ఈశ్వరరావు, గుడుపూరు గణపతి, జి.లక్ష్మణ, ఎం.పైడిరాజు, పి.రామారావు, జి.అచ్చియ్య, పైడయ్య, ఆర్.తిరుపతి, ఎస్.శివకృష్ణ, గంగయ్య, జి.సత్యం, ఎస్.సత్యం, మజ్జియ్య తదితరుల రైతులకు సంబంధించిన తోటల్లోని చెట్లు దగ్ధమయ్యాయి. దీనిపై ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలని బాధిత రైతులు కోరుతున్నారు.

జాతర వైభవం

విజయనగరం పట్టణంలోని సంగీత కళాశాల సమీపంలో ఎల్లారమ్మ తల్లి జాతర శుక్రవారం వేడుకగా సాగింది. అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. సాయంత్రం జరిగిన సిరిమానోత్సవాన్ని తిలకించారు. సిరిమాను పూజారి చందకత్రినాథ్ రూపంలో వచ్చిన సిరుల తల్లిని దర్శించుకుని ఆశీస్సులు అందుకున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం




సిరిమానోత్సవ సందడి

ఇష్టారాజ్యంగా కంకర తరలింపు



కంకర లోడ్ చేసేందుకు క్యూలో ఉన్న ట్రాక్టర్లు



కంకర లోడులతో రోడ్డుపై వెళ్తున్న ట్రాక్టర్లు

- పట్టించుకోని రెవెన్యూ అధికారులు

సాలూరు రూరల్: మండలంలోని నెలిపర్తి పంచాయతీ బట్టివలస గ్రామం వెళ్లే దారిలో గడిచిన 5 రోజులుగా అక్రమంగా కంకర తవ్వకాలు జరుగుతున్నాయి. ఈ విషయం రెవెన్యూ అధికారులకు తెలిసినప్పటికీ కనీసం అటువైపు కన్నెత్తి కూడా చూడకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.ఈ వ్యవహారంలో అక్రమ కంకర తవ్వకం దారులకు తెలుగుతమ్ముళ్లు అండగా ఉన్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. రెవెన్యూలో ఉన్నతాధికారులను సైతం వారు మేనేజ్ చేస్తామని అక్రమార్కులకు భరోసా ఇస్తున్నట్లు పలువురు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. కంకర తవ్వకాల్లో జేసీబీతో పాటు సుమారు 10నుంచి 15 ట్రాక్టర్లు రవాణాలో వినియోగిస్తున్నారు. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు మండలం నుంచి విజయనగరం జిల్లా రామభద్రపురం మండలానికి కంకర రవాణా చేస్తున్నారు.

కనీసం ఎలాంటి అనుమతులు లేకుండా ఇంత బహిరంగంగా పక్క జిల్లాకు కంకర రవాణా జరుగుతున్నా ఇంతవరకు అధికారులు పట్టించుకోకపోవడం వెనుక కంకర అక్రమ తవ్వకాలను ఏమేరకు రెవెన్యూ అధికారులు ప్రోత్సహిస్తున్నారో అర్థమవుతోందని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు ఈ విషయంలో చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.